# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 4 pm

మంగళవారం 25-7-2023


# వామ్మో..

## ఒకే ట్రాక్ పైకి రెండు రైళ్లు

లోకో పైలట్ల ముందుచూపుతో తప్పిన ముప్పు

హైదరాబాద్ మలక్‌పేటలో ఘటన

లోపం ఎక్కడుంది?

**హైదరాబాద్, జూలై 25 (తెలుగుప్రభ)**

హైదరాబాద్‌లో మరో రైలు ప్రమాదం తృటిలో తప్పింది. మలక్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో రెండు ఎంఎంటీఎస్ రైళ్లు ఒకే ట్రాక్‌పైకి వచ్చాయి. అయితే రెండు రైళ్లలోని లోక్ పైలట్లు ముందే గమనించి ట్రైన్లను నిలిపివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పైకి రావడంతో ప్రయాణికులు కాసేపు టెన్షన్ పడ్డారు. లోక్ పైలట్లు అప్రమత్తమై చాకచక్యంగా వ్యవహరించడం, ట్రైన్లను నిలిపివేయడంతో ప్రయాణికులందరూ ఊపిరిపీల్చుకున్నారు. అదే రెండు రైళ్లు ఢీకొని ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని అంటున్నారు. దక్షిణ మధ్య రైల్వే అధికారులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఒక రైలును మరో ట్రాక్‌పైకి మళ్లించారు. దీంతో రెండు రైళ్లు వేరే వేరే ట్రాక్‌ల పైనుంచి వెళ్లాయి. ఈ ఘటనతో రెండు ఎంఎంటీఎస్ ట్రైన్లు అరగంటపాటు ఆగిపోయాయి. అయితే ఈ ఘటనపై సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు విచారణ చేపడుతున్నారు. రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పైకి ఎలా వచ్చాయనేది ఆరా తీస్తున్నారు. రైల్వే సిబ్బంది నిర్లక్ష్యంగానే ఇలా జరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో లోపం ఎక్కడ జరిగిందనేది తెలుసుకునే ప్రయత్నం అధికారులు చేస్తున్నారు.



# అయ్యో.. పాపం

## వాగులో కొట్టుకుపోయిన యువతులు

**మహబూబ్‌నగర్, జూలై 25 (తెలుగుప్రభ)**

ఎడతెరిపి లేని వర్షాలు ప్రజల జీవనాన్ని స్తంభింపచేయడమే కాకుండా కొన్ని కుటుంబాల్లో విషాదాన్ని నింపుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కొండేడ్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. వ్యవసాయ పనులకు వెళ్తున్న ఇద్దరు అమ్మాయిలు వాగులో పడి మృతి చెందారు. కొండేడ్ సమీపంలో ప్రవహిస్తున్న దుందుభి వాగును దాటేందుకు ప్రయత్నిస్తుండగా కాలు జారి ఇద్దరూ వాగులో కొట్టుకుపోయారు. గాలింపు చర్యలు చేపట్టి బయటకు తీసుకురాగా.. అప్పటికే ఇద్దరు అమ్మాయిలు మృతి చెందారు.



# అమెరికాలో అన్నమో రామచంద్ర

## తెలంగాణలో గోదాములు ఫుల్..

గతేడాది తెలంగాణలో పండే వడ్లు కొనబోమని పేచీలు పెట్టిన కేంద్ర ప్రభుత్వం.. దేశం సంక్షోభంలో ఉన్నా పట్టువిడుపులకు పోయి ప్రజల ఆరోగ్య భద్రతను గాలికొదిలేస్తోంది. తెలంగాణ గోదాముల్లో ధాన్యం నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. మిల్లుల్లో సుమారు 1.10 కోట్ల టన్నుల ధాన్యం ఉంది. ఈ ధాన్యాన్ని శుద్ధి చేసి ఇస్తాం తీసుకోండి మహా ప్రభో....అని రాష్ట్రం మొత్తుకుంటున్నా మోడీ సర్కార్ మాత్రం అందుకు ససేమిరా అంగీకరించడం లేదు.

తెల్లబియ్యం ఎగుమతులపై నిషేధం విధించిన మోడీ సర్కార్

యూఎస్‌లో స్టోర్ల ఎదుట భారులు తీరిన ప్రవాస భారతీయులు

కొండెక్కుతున్న రేట్లు

తెలంగాణ గోదాముల్లో నిల్వలున్నా పట్టించుకోని కేంద్రం

గతేడాది వడ్లు కొనలేమని తెలంగాణ రైతులను ఏడిపించిన కేంద్రంలోని మోడీ సర్కార్.. మరోసారి తెలుగువారి జేబులు చిల్లుపడేలా చేసింది. అయితే, దెబ్బ పడింది హైదరాబాద్‌లో కాదు.. అమెరికాలో..!

తెలుగు ప్రభ (జులై 24):

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు మారినా, బయట లభ్యమవుతున్న పలురకాల మోడ్రన్ వంటకాలు ఎన్ని రుచి చూసినా ఇంటికి తిరిగొచ్చాక రెండు ముద్దల అన్నం తినందే ఆ రోజు పూర్తైనట్టు ఉండదు. తెలుగువారితో పాటు దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు 'అన్నం పరబ్రహ్మ స్వరూపం'. ఇక్కడ kఉన్నవారికే కాదు.. ఈ నేల నుంచి విదేశాలకు, మరీ ముఖ్యంగా గల్ఫ్, అమెరికాకు ఉద్యోగం, బతుకుదెరువు రీత్యా వెళ్లే దక్షిణాదీలకు అక్కడ ఎన్ని రకాల వంటకాలు దొరికినా వారి ఫుడ్ మెనూలో 'అన్నం' మాత్రం ఉండాల్సిందే. కానీ ఇప్పుడు వారికి తినాలంటే ఆదాయం సరిపోక అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. బ్యాంకులలో దాచుకున్నదంతా ఊడ్చి పెట్టినా బియ్యం కొనడం దుర్లభమైనది. దీనికి కారణం.. ఘనత వహించిన నరేంద్ర మోడీ సర్కారే. భారత్‌లో విరివిగా పండే 'తెల్లబియ్యం' ఎగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నిషేధం విధించడంతో అమెరికాలో 'బియ్యం సంక్షోభం' తలెత్తింది.

జులై 20న కేంద్రంలోని మోడీ సర్కారు బాస్మతీయేతర తెల్లబియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. మొన్నటివరకూ 20 శాతం అదనపు సుంకంతో బియ్యం ఎగుమతులు చేసిన భారత్.. ఇప్పుడు వాటిపై పూర్తిగా బ్యాన్ వేసింది. ఈ వార్త తెలిసిన వెంటనే అమెరికాలో నివాసముంటున్న దక్షిణ భారతీయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. ఉద్యోగాలకు సెలవులు పెట్టి మరీ చాలా మంది బియ్యం అమ్మే స్టోర్ల ముందు భారీ క్యూలు కట్టారు. న్యూజెర్సీ, లాస్ ఏంజెల్స్, వర్జీనియా, సియాటెల్, డల్లాస్, మిచిగాన్‌లలో ఉండే తెలుగువారితో పాటు దక్షిణాది రాష్ట్రాల ప్రజలు.. దుకాణాల ముందు బియ్యం కోసం ఎగబడ్డారు. ఎన్ని బస్తాలు దొరికితే అన్ని తీసుకుపోయారు. స్టోర్లలో బియ్యం కొనుగోలుకు అనుమతించిన వెంటనే బస్తాల కోసం వాటి మీద ఎగబడుతున్న వీడియోలు నెట్టింట వైరల్ అయ్యాయి. నిత్యం ఆకలితో అలమటించే ఆఫ్రికా ఖండంలో కూడా ఇటీవలి కాలంలో ఇటువంటి దృశ్యాలు చూడలేదు. అమెరికాతో పాటు గల్ఫ్ దేశాలలో ఎక్కువగా ఉండే దక్షిణాది ప్రజలపై రాబోయే కాలంలో ఈ ప్రభావం స్పష్టంగా పడనుంది.

### కొండెక్కిన రేట్లు

భారత ప్రభుత్వ ప్రకటన తర్వాత అమెరికాలో బియ్యం బస్తాల రేట్లు కొండెక్కాయి. ప్రవాస భారతీయులు సోనామసూరి బియ్యం 9 కిలోల బస్తా (20 ఎల్బీ) మొన్నటివరకూ 15 డాలర్లకు కొనేవాళ్లు.. కేంద్ర ప్రభుత్వ ప్రకటన తర్వాత అదే బస్తా 40 డాలర్లకు కూడా దొరకడం లేదు. కొన్నిచోట్ల ధరలు నాలుగు రెట్లు పెరిగాయని రిపోర్టులు వస్తున్నాయి. అయినప్పటికీ ఎగబడుతుండటంతో స్టోర్స్‌లో బియ్యం బస్తాలు నిమిషాల మీద ఖాళీ అవడంతో ప్రవాసులు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

అమెరికాలో తెలుగువారితో పాటు అక్కడికి వలసవెళ్లిన దక్షిణాది రాష్ట్రాల ప్రజలు సోనా మసూరి రకాలనే ఎక్కువగా తింటారు. ఇప్పుడు వీటి ధరలు అగ్రరాజ్యంలో మండిపోతున్నాయి. ఒకవేళ సోనా మసూరి నిల్వలు నిండుకుంటే.. వియత్నాం, ఆగ్నేయాసియా దేశాల నుంచి వచ్చే నాసిరకం బియ్యం గానీ లేదంటే బిర్యానీ తయారీలో వాడే బాస్మతి బియ్యం గానీ తినాల్సి ఉంటుంది. కానీ బాస్మతి బియ్యం చాల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. డల్లాస్‌లో భారతీయ బిల్డర్లు.. ఒక ఫ్లాట్ కొంటే 20 కిలోల బియ్యం బస్తా ఫ్రీ ఇస్తామని ఆఫర్ ఇస్తున్నారంటే అక్కడ పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### నిషేధం ఎందుకు?

దేశవ్యాప్తంగా పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం ఇప్పటికే భారీగా పెరిగిపోయింది. ఒక నివేదిక ప్రకారం.. గడిచిన ఏడాదికాలంలో బియ్యం ధరలు గతంలో కంటే 11.8 శాతం పెరిగాయి. గత నెల రోజుల్లోనే ఇవి 3 శాతం పెరగడం ఆందోళనకరంగా ఉండటంతో ప్రభుత్వం తెల్లబియ్యంపై నిషేధం విధించింది. ఇదేగాక దేశంలో ఈ ఏడాది ఉత్తరాదిలో కురుస్తున్న భారీ వర్షాలకు వరి విస్తీర్ణం భారీగా తగ్గనుంది. వరి అధికంగా పండించే పంజాబ్‌పై కూడా ఈ ప్రభావం పడనుంది. ఈ నేపథ్యంలో కేంద్రం బియ్యం ఎగుమతులను బ్యాన్ చేసింది.

ప్రభుత్వ వాదన ఇలా ఉండగా.. అసలు కిటుకు మాత్రం మరో విధంగా ఉంది. ఇప్పటికే దేశంలో నిత్యావసర ధరలు అదుపు తప్పగా వాటిని నియంత్రించడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు శూన్యం. ఈ ఏడాది ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలున్నాయి. వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలూ జరగాల్సి ఉంది. అప్పటివరకూ నిత్యావసర ధరల్లో ఇదే ట్రెండ కొనసాగితే అది ప్రభుత్వం మీద తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశముంది. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కేంద్ర ప్రభుత్వం తెల్లబియ్యం ఎగుమతులపై నిషేధం విధించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# 46.3 సెం.మీ

# వర్షపాతంలో రికార్డ్

## నిజామాబాద్ జిల్లా వేల్పూరులో..

## వానలకు తెలంగాణ ఆగమాగం


**హైదరాబాద్ జిల్లా, జూలై 25 (తెలుగుప్రభ)**

రాష్ట్రంలో వానలు దంచికొడుతున్నాయి. ఎడతెరిపిలేని వానలతో అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. ముఖ్యంగా ఉత్తర ఉత్తర తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు మత్తడి దుంకుతున్నాయి. పలు చోట్ల రోడ్లు తెగిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలో పిడుగు పడి ఇల్లు ధ్వంసమైంది.

మహబూబాబాద్ జిల్లా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వట్టి వాగు బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తుండటంతో కేసముద్రం – గూడూరు మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం వద్ద లోయర్ బ్రిడ్జి నుంచి నీరు ప్రవహిస్తుండడంతో పెద్ద ముప్పారం -దంతాలపల్లి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



### నిజామా'బాధ'లు



భారీ వర్షానికి నిజామాబాద్ జిల్లా ఆగమాగం అవుతోంది. వేల్పూరు లో 46.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. పోలీస్‌స్టేషన్ నిండా మునిగింది. పోలీసులు సైతం వరదలో చిక్కుకున్నారు. వేల్పూర్ దగ్గర చెరువుకు గండి పడటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వేల్పూర్ పీఎస్, ఎమ్మార్వో ఆఫీస్, ఐకేపీ, రైతు వేదికలు నీట మునిగాయి. వేల్పూర్‌లో నీటి ప్రవాహానికి 9 బైక్‌లు కొట్టుకుపోయాయి. ఆర్మూర్-భీంగల్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పచ్చల నడికూడ-భీంగల్ మధ్య ఊర చెరువుకు గండి పడింది. స్థానిక ఎమ్మెల్యే పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు.

### హైదరాబాద్‌లో ట్రాఫికర్

హైదరాబాద్‌లో వర్షం ఆగడం లేదు. నిన్న సాయంత్రం కురిసిన వర్షానికే రోడ్లు జలమయం అయ్యాయి. ఇవాళ ఉదయం నుంచి మళ్లీ వర్షం మొదలైంది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. పలు కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోకి నీళ్లు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిన్న సాయంత్రం కురిసిన భారీ వానకు గ్రేటర్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌కారణంగా వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఇవాళ ఉదయం సైతం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

ఐటీ కారిడార్‌లో వాటర్‌లాగింగ్ పాయింట్ల వద్ద భారీగా వర్షపు నీరు చేరింది. ఉద్యోగులు, విద్యార్థులు వివిధ పనులపై బయటకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులు వాహనాలతో నిండిపోయాయి. కిలోమీటర్ దూరానికి దాదాపు గంటకుపైగా టైమ్ పట్టింది. బయో డైవర్సిటీ నుంచి జేఎన్టీయూ వెళ్లే దారిలో, సైబర్ టవర్స్, గచ్చిబౌలి, విప్రో, లింగంపల్లి, నల్లగండ్ల, ఖాజాగూడ జంక్షన్ల వద్ద ట్రాఫిక్ రద్దీ నెలకొంది. హైటెక్‌సిటీ, నానక్‌రాంగూడలోని ఐటీ ఎంప్లాయీస్ ఇండ్లకు చేరుకునేందుకు నిన్న సాయంత్రం దాదాపు 2 నుంచి 3 గంటల టైమ్ పట్టింది. పంజాగుట్ట, బంజారాహిల్స్, ఖైరతాబాద్, నాంపల్లి, కూకట్‌పల్లి, సనత్‌నగర్, అమీర్ పేట, మెహిదీపట్నం, అశోక్‌నగర్, సికింద్రాబాద్ మణికొండ, నార్సింగి సహా సిటీ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, వనస్థలిపురం, విజయవాడ హైవేపై వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వరద ప్రవాహం పెరగడంతో హుస్సేన్‌సాగర్ గేట్లు తెరిచారు.

# పెరుగుతున్న ఫిర్యాదులు


**హైదరాబాద్, జూలై25(తెలుగుప్రభ):**

వరుసగా కురుస్తున్న వర్షాలకు నగరంలో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. చెట్లు, గోడలు కూలుతున్న ఘటనలు ఎక్కువవుతున్నాయి. నీటి నిల్వల సమస్యలూ పెరుగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ విభాగానికి 46 ఫిర్యాదులందాయి. వీటిల్లో 32 ప్రాంతాల్లో రోడ్లు చెరువులుగా మారినవి, 12 ప్రాంతాల్లో చెట్లు కూలినవి, రెండు గోడలు కూలిన ఫిర్యాదులున్నాయి. అన్నింటినీ పరిష్కరించినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఇవి కాక కాల్‌సెంటర్‌కు, సోషల్ మీడియా ద్వారా అందుతున్న ఫిర్యాదులు ఇంకా ఎక్కువే ఉన్నాయి. అన్ని వేదికల ద్వారా మొత్తం ఎన్ని ఫిర్యాదులందుతున్నాయో క్రోఢీకరించే పనిని జీహెచ్ఎంసీ చేపట్టలేదు. ఆ పని చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.



# ఆ ఉత్తర్వుల్లో స్వల్ప మార్పు

**ఖమ్మం జిల్లా, జూలై 25 (తెలుగుప్రభ)**



రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన అదనపు కలెక్టర్ల బదిలీలలో ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ గా ఉన్న మధుసూదన్ హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. కాగా, మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న అదనపు కలెక్టర్ జి.మధుసూదన్ నాయక్ ను ఖమ్మం జిల్లాకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు బదిలీ ఉత్తర్వులతో ఖమ్మం అదనపు కలెక్టర్ మధుసూదన్ ఖమ్మంలో శనివారం రిలీవ్ కాగా, సోమవారం మధుసూదన్ నాయక్ స్థానంలో ఎన్ . నటరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో మంగళవారం స్వల్ప మార్పులు చేసింది. త్వరలో అదనపు కలెక్టర్ నటరాజ్ బాధ్యతలు చేపట్టనున్నారు.

# లంచం సొమ్ము మింగేశాడు..

**న్యూఢిల్లీ, జూలై 25 (తెలుగుప్రభ)**



ఓ రెవెన్యూ అధికారి లంచం తీసుకున్నాడు. నిఘా పెట్టిన అధికారులకు ఎక్కడ దొరుకుతానో ఏమో అని లంచం సొమ్మును మింగేశాడు.. ఇప్పుడా వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లోని కట్నిలో రెవెన్యూశాఖ అధికారి రూ.5వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అయితే లోకాయుక్త స్పెషల్ పోలీసులు అతన్ని వల వేసి పట్టుకున్నారు. పట్వారి గజేంద్ర సింగ్ తన ప్రైవేటు ఆఫీసులో ఓ వ్యక్తి నుంచి రూ.5వేలు తీసుకున్నాడు. దాంట్లో రూ.500 నోట్లు ఉన్నాయి. అయితే పోలీసుల్ని చూడగానే ఆ పట్వారి తన వద్ద ఉన్న కరెన్సీ నోట్లను నమిలి మింగేశాడు. పట్వారి గజేంద్ర లంచం తీసుకున్నట్లు ఎస్పీ సంజయ్ సాహూ తెలిపారు. బార్కేడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తమకు పట్వారి గురించి ఫిర్యాదు చేశాడని పోలీసులు చెప్పారు. ప్రస్తుతం గజేంద్ర ఆస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. అతను క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో కేసు రిజిస్టర్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.